క్లుప్తంగా

నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణానికి నిధులివ్వండి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాలటౌన్‌: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలో కాంగ్రెస్‌ హయాంలో ప్రారంభించి.. బీఆర్‌ఎస్‌ పాలనలో నిర్మాణం పూర్తి కాని సుమారు 1,600 ఇందిరమ్మ ఇళ్ల పూర్తికి నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు గురువారం లేఖ రాశారు. పట్టణంలో ఇళ్లులేని నాలుగు వేల మంది పేదలను గుర్తించిన గత కాంగ్రెస్‌ ప్రభుత్వం వారికి ఇళ్లు మంజూరు చేసిందని, రాష్ట్రం ఏర్పడ్డ అధికారంలోకొచ్చిన బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదని తెలిపారు. ఇంకా 1600 ఇళ్లు ఇప్పటికీ నిర్మాణం పూర్తి కాకుండా ఉండిపోయాయన్నారు. ఆ లబ్ధిదారులకు నిధులు కేటాయించాలని కోరారు.

రైతు బీమాపై విచారణ

ఇబ్రహీంపట్నం: వేములకుర్తి గ్రామంలో మైలారపు చిన్న నర్సయ్య అనే రైతు వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడికి రైతు బీమా ఉన్నందున గురువారం ఏఈవో హరీశ్‌ మృతుడి నామిని మైలారపు లలిత ఆధార్‌ కార్డు, బ్యాంకు ఖాతా తదితర వివరాలను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి ఇన్సూరెన్స్‌ డబ్బులు అందించేందుకు గాను ఉన్నతాధికారులకు పత్రాలను పంపిస్తున్నట్లు ఏఈవో తెలిపారు. నాయకుడు పెంట లింబాద్రి, అలె రమేశ్‌, మృతుడి కుటుంబ సభ్యులున్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోండి

మెట్‌పల్లిరూరల్‌: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కింద పడి మృతిచెందిన జూగిలుల గౌడ్‌ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి చంద్రశేఖర్‌గౌడ్‌ అన్నారు. వెల్లుల్లలో గౌడ్‌ కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందజేశారు. గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీర్‌పూర్‌ ఎస్సైగా బాధ్యతల స్వీకరణ

సారంగాపూర్‌: బీర్‌పూర్‌ ఎస్సైగా కె.కుమారస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన గౌతంపవార్‌ దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లడంతో.. ఆయన స్థానంలో మల్యాల ఎస్సైగా ఉన్న కుమారస్వామిని బీర్‌పూర్‌ ఎస్సైగా బదిలీ చేశారు.

ఎస్పీని కలిసిన డీఎస్పీ సీఐ

జగిత్యాలక్రైం: జగిత్యాల డీఎస్పీ సీఐగా ఆరిఫ్‌ అలీఖాన్‌ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

మహిళల భద్రతకు షీటీం కృషి

జగిత్యాలక్రైం: మహిళల భద్రతకు షీటీం కృషి చేస్తుందని సీసీఎస్‌ ఎస్సై తిరుపతి అన్నారు. గురువారం ఎస్పీ అశోక్‌కుమార్‌ ఆదేశాల మేరకు తాటిపల్లిలోని సోషల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ స్కూల్‌, కాలేజీలో షీటీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లాలోని మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలున్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలన్నారు. షీటీం ఎస్సై అలీషేర్‌, ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

ఏవో పరీక్షలో 48వ ర్యాంక్‌

కోరుట్లటౌన్‌: టీజీఎస్‌సీ నిర్వహించిన మండల వ్యవసాయ అధికారి పరీక్షలో కోరుట్లకు చెందిన శ్రీరెడ్డి జగదీశ్వర్‌ రాష్ట్రస్థాయిలో 48వ ర్యాంకు సాధించాడు. జగదీశ్వర్‌ బీఎస్సీ అగ్రికల్చర్‌ జిల్లాలోని పాలంపేట, ఎమ్మెస్సీ అగ్రికల్చర్‌ను మహారాష్ట్రలోని పర్బని యూనివర్సిటీలో పూర్తి చేశాడు. ప్రస్తుతం ఉద్యాన అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో నేలశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు.

ఐటీఐలో రెండో విడత అడ్మిషన్లు

జగిత్యాల: ప్రభుత్వ, ప్రైవేట్‌ ఐటీఐలో రెండో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జగిత్యాల ఐటీఐ ప్రిన్సిపాల్‌ గంట్యాల రవీందర్‌ తెలిపారు. పదోతరగతి పాసైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 15లోపు ITI.TELANGANA.GOV.IN ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య

గొల్లపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య అని మాజీ వైస్‌ ఎంపీపీ ఆవుల సత్యం అన్నారు. గురువారం మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

కొండగట్టు(మల్యాల): కొత్త మహిళా చట్టాలపై అవగాహన కల్పించడానికి పూడూరు పోలీసు స్టేషన్‌ సదస్సు నిర్వహించారు. జెండర్‌ స్పెషలిస్ట్‌ గౌతమి, స్వప్న మహిళా సాధికారత కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.



జగిత్యాలరూరల్‌: ఎంపీటీసీలను సన్మానిస్తున్న జీవన్‌రెడ్డి



ఎంపీపీ రేవతి, జెడ్పీటీసీ భూమయ్య, ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు

ప్రజాప్రతినిధులకు వీడ్కోలు

జగిత్యాలరూరల్‌: యూపీఏ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగ సవరణ ద్వారానే స్థానిక సంస్థలకు నిధులు, విధులు కేటాయించడం జరిగిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీటీసీలకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ సంక్షేమ కార్యక్రమాలు రూపొందించినా.. వాటి అమలు క్షేత్రస్థాయిలో స్థానిక సంస్థలకే ఉంటుందన్నారు. జెడ్పీటీసీ మహేశ్‌, ఇన్‌చార్జి ఎంపీపీ ములాసపు లక్ష్మీ, మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్‌, తహసీల్దార్‌ వర్ధన్‌, డిప్యూటీ తహసీల్దార్‌ రాజేందర్‌రావు, ఎంపీడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

సేవ చేసినవారికి గుర్తింపు

కథలాపూర్‌: నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవ చేసినవారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని కథలాపూర్‌ ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య అన్నారు. గురువారం మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీటీసీతోపాటు ఎంపీటీసీలకు అధికారులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శంకర్‌, వైస్‌ ఎంపీపీ కిరణ్‌రావు, ఎంపీటీసీలు బొడ్డు బాలు, కొండ అంజనేయులు, మల్యాల రమేశ్‌, దేవేంద్ర, గంగరాజం తదితరులు పాల్గొన్నారు.



కొమ్ముల రాధ-ఆదిరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

రాయికల్‌: ఐలేశ్వర గ్రామంలో ఐదేళ్లపాటు ఎంపీటీసీగా పని చేసిన కొమ్ముల రాధ-ఆదిరెడ్డి పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సింగిల్‌విండో చైర్మన్‌ మహిపతిరెడ్డి, నాయకులు గంగారెడ్డి, చంద్రశేఖర్‌, కంటె విష్ణు, సామల్ల వేణు, రొట్ట శ్రీధర్‌, మర్రిపల్లి శ్రీనివాస్‌గౌడ్‌, అనుపురం చిన్నలింబాద్రి, సత్తయ్య పాల్గొన్నారు.



సారంగాపూర్‌ మండల పరిషత్‌ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ జమున

సారంగాపూర్‌: పదవి ఉన్నా లేకున్నా ప్రజల మధ్య ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సారంగాపూర్‌, బీర్‌పూర్‌ ఎంపీపీలు కోల జమున, మసర్తి రమేశ్‌ అన్నారు. సారంగాపూర్‌, బీర్‌పూర్‌ మండల పరిషత్‌ కార్యాలయాల్లో గురువారం ఎంపీపీలకు ఆయా మండలాల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది వీడ్కోలు పలికారు. మండల ప్రత్యేకాధికారి సుజాత, తహసీల్దార్‌ రమేశ్‌, సారంగాపూర్‌, బీర్‌పూర్‌ మండలాల ఎంపీడీవో లచ్చాలు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



రాయికల్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



జగిత్యాలటౌన్‌: ఫ్లెక్సీలు దహనం చేస్తున్న హిందూవాహిని నాయకులు

రాయికల్‌: రాహుల్‌గాంధీ హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ నాయకులు గురువారం పట్టణంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, కిసాన్‌ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్మ మల్లారెడ్డి, నాయకులు సంజీవ్‌, తిరుపతినాయక్‌, మహేశ్‌, శ్రీకాంత్‌రెడ్డి, ఆకాష్‌, సతీశ్‌, హరీశ్‌, రామకృష్ణ, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్‌: పార్లమెంట్‌ సాక్షిగా హిందూ దేవతలను కించపరిచే వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీతోపాటు పరాయి దేశానికి జైకొట్టిన అసదుద్దీన్‌ ఒవైసి పార్లమెంట్‌ సభ్యత్వాలు రద్దు చేయాలని హిందూవాహిని తెలంగాణ సంపర్క్‌ ప్రముఖ్‌ వేముల సంతోష్‌ డిమాండ్‌ చేశారు. పార్లమెంటులో రాహుల్‌, అసదుద్దీన్‌ల వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని తహసీల్‌ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేసిన హిందూవాహిని ప్రతినిధులు ఇరువురు ఎంపీల ఫ్లెక్సీలను దహనం చేశారు. కైలాస్‌ పతి, హరీశ్‌, సంపత్‌, బీజేపీ నాయకులు సీపెల్లి రవీందర్‌, లింగంపేట శ్రీనివాస్‌, అంకారి సుధాకర్‌, వీరబత్తిని అనిల్‌, కిషోర్‌, జడి శంకర్‌, శ్రీధర్‌, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి

రాయికల్‌: రెండు కాళ్లు పని చేయకున్నా రెండు సార్లు తాను ఐఏఎస్‌ పాస్‌ అయ్యానని ప్రముఖ మోటివేషన్‌ స్పీకర్‌, సీఎస్‌బీ ఐఏఎస్‌ అకాడమీ ఫౌండర్‌ శ్రీమతి బాల లత అన్నారు. గురువారం పట్టణంలోని విజడమ్‌ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు ఎంచుకొని చదివితేనే అనుకున్నది సాధిస్తారని సూచించారు. ఐఏఎస్‌ కావాలంటే ఎలా సన్నద్ధం కావాలో అవగాహన కల్పించారు. కరస్పాండెంట్‌ ఎద్దండి ముత్యం రాజిరెడ్డి, డైరెక్టర్‌ నివేదితరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులతో ఐఏఎస్‌ అకాడమీ ఫౌండర్‌ బాల లత

ముత్యంపేటలో కంటి వైద్యశిబిరం

మల్లాపూర్‌: ముత్యంపేటలోని రెడ్డి ఫంక్షన్‌ హాల్‌లో శుక్రవారం లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు తోట రాజారాం తెలిపారు. మండల కేంద్రంలో గురువారం లయన్స్‌ క్లబ్‌ సభ్యులతో కలిసి వైద్య శిబిర కరపత్రాలను ఆవిష్కరించారు. రేకుర్తి కంటి ఆసుపత్రి సహకారంతో లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంటి వైద్యశిబిరానికి మండల ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శస్త్ర చికిత్సలు చేయించుకునే వారు తెల్ల రేషన్‌, ఆధార్‌ కార్డులు తీసుకురావాలని సూచించారు. లయన్స్‌ క్లబ్‌ కార్యదర్శి సుతారి రాజేందర్‌, కోశాధికారి మర్గం రాజేశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తోట రాజారాం, సభ్యులు

సీజనల్‌ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్‌: సీజనల్‌ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్‌ అధికారి, మండల వైద్యాధికారి డాక్టర్‌ వాహిని అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ మినీ గురుకుల బాలికల పాఠశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల ఆరోగ్య సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నివారణకు పిచికారీ చేయించాలన్నారు. 117 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 11 మందికి మందులు పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు లక్ష్మీప్రియాంక, శ్రీలత, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రామ్మోహన్‌, హెల్త్‌ సూపర్‌వైజర్‌ ఇబ్రహీంఖాన్‌ శ్రీనివాస్‌, ఇందిర, ల్యాబ్‌ టెక్నీషియన్‌ ఉమాదేవి, ఏఎన్‌ఎంలు అంజలి, రాధ, అరుణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ మినీ గురుకుల బాలికల పాఠశాలలో వైద్య పరీక్షలు

రైతులు జాగ్రత్త వహించాలి

మెట్‌పల్లిరూరల్‌: మొక్కజొన్న పంటకు బీడపురుగు సోకకుండా రైతులు జాగ్రత్త వహించాలని మండల వ్యవసాయాధికారి షాహిద్‌అలీ సూచించారు. ఆత్మకూర్‌లో బీడబీడం నివారణపై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. పలువురు రైతులకు చెందిన మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు, సూక్ష్మదాతు పోషక లోపం ఉన్నట్లు గుర్తించారు. కత్తెర పురుగు నివారణకు ఎకరానికి ఇమామెక్టిన్‌ బెంజోయేట్‌ 100 గ్రాములు లేదా స్పినోసాడ్‌ 100మి.లీ. ఎకరానికి, వేపనూనె లీటర్‌తో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సూక్ష్మధాతు పోషక లోపం నివారణకు అన్నభేది ఎకరానికి 400 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. ఏఈవో భూమేశ్వర్‌, రైతులు అంజయ్య, ప్రదీప్‌, భూమారెడ్డి, రాజారెడ్డి, తుక్కురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జగన్నాథస్వామి బ్రహ్మోత్సవాలు

సారంగాపూర్‌: రేచపల్లి శ్రీజగన్నాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 6నుంచి ప్రారంభం కానున్నాయి. నీలాచల కొండపై స్వయంభూగా వెలిసిన స్వామివారికి ఏటా బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. మొదటి రోజు పుణ్యాహవచనం, అంకురార్పణ, విశ్వక్సేనారాధన తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.



పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

మల్యాల: నర్సరీల నిర్వహణతోపాటు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల పరిషత్‌ అభివృద్ధి అధికారి స్వాతి అన్నారు. సర్వాపూర్‌ గ్రామాన్ని గురువారం సందర్శించారు. గ్రామ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన వైఖరిని అభినందించారు. గ్రామంలోని నర్సరీ పరిశీలించారు. ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా ఉపాధిహామీ కూలీలతో కలిసి రోడ్డు పక్కన మొక్కలు నాటారు. టీఏ లావణ్య తదితరులున్నారు.



నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వాతి

బాసర ట్రిపుల్‌ ఐటీ సీటు సాధించిన విద్యార్థినికి అభినందన

మల్యాల: పోతారం గ్రామానికి చెందిన ఆరె సంజన పదోతరగతిలో 9.5 జీపీఏ ఉత్తీర్ణతతో బాసర ట్రిపుల్‌ ఐటీ సీటు సాధించింది. గురువారం పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు జెడ్పీహెచ్‌ఎస్‌ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో శాలువాతో సన్మానించారు. గ్రామ ప్రత్యేకాధికారి జ్ఞానేశ్వర్‌, జయసింహారావు, కాంగ్రెస్‌ గ్రామ శాఖ అధ్యక్షుడు అరుణ్‌ పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాలువ మట్టి తొలగింపు

ఇబ్రహీంపట్నం: వేములకుర్తి గ్రామంలో ఊరచెరువు కాలువ కొన్ని సంవత్సరాలుగా కూలిపోయి ఉంది. ఈ కాలువలో పూడిక తీయాలని అధికారులు, నాయకులకు గ్రామస్తులు విన్నవించినా పట్టించుకోకపోవడంతో.. గురువారం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పొక్లెయిన్‌ ద్వారా కాలువలో పిచ్చిమొక్కలను తొలగించారు. నీళ్ల వెళ్లేలా కాలువలోని మట్టిని తొలగించారు.

శునకాలకు ఉచితంగా టీకాలు

జగిత్యాలటౌన్‌/జగిత్యాల: ప్రపంచ జూనోటిక్‌ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం శునకాలకు ఉచితంగా యాంటీ రేబిస్‌ టీకాలు వేయనున్నట్లు జగిత్యాల పశువైద్య సహాయ సంచాలకుడు డా.మదన్‌మోహన్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పశువైద్య శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల ప్రాంతీయ వైద్యశాలలో టీకాలు వేస్తామని, ఈ అవకాశాన్ని పెంపుడు కుక్కల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెలుగు అధ్యాపకుడికి డాక్టరేట్‌

జగిత్యాల: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న రావర్తి శ్రీనివాస్‌కు డాక్టరేట్‌ లభించింది. సిద్దిపేట జిల్లాలో ప్రముఖ తత్వకవిగా, అభినవ వేమనగా కొనియాడబడిన వరకవి సిద్ధప్ప వరకవి రచనలపై వరకవి సిద్ధప్ప సాహిత్యానుశీలన అనే అంశంపై పరిశోధన వ్యాసం సమర్పించినందుకు గాను ఉస్మానియా యూనివర్సిటీ(ఓరియంటల్‌ లాంగ్వేజ్‌) పీహెచ్‌డీని ప్రకటించింది. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ వై.సత్యనారాయణ, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

జగిత్యాల: జిల్లా కలెక్టర్‌ సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు. పనులను వేగవంతం చేసేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు.

దాబాల్లో మద్యం సిట్టింగులు నిర్వహిస్తే కేసులు

మెట్‌పల్లి: దాబాల్లో మద్యం సిట్టింగులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణ శివారులోని జాతీయ రహదారి పక్కన ఉన్న పలు దాబాల్లో ఎస్‌ఐ చిరంజీవి, సిబ్బందితో కలిసి గురువారం తనిఖీ చేశారు. మద్యం తాగుతూ పలువురు పట్టుబడగా.. వారికి సీఐ కౌన్సెలింగ్‌ నిర్వహించారు.

కిరాణ దుకాణంలో మద్యం విక్రయంపై కేసు

మెట్‌పల్లి: పట్టణంలోని వెల్లుల రోడ్‌లో ఉన్న హరిప్రియ కిరాణ దుకాణంలో మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి గురువారం తెలిపారు. కిరాణంలో కొంతకాలంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో తనిఖీ నిర్వహించారు. నిల్వ ఉంచిన ఆరు లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని యజమాని లక్ష్మీనర్సయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఐదుగురిపై..

సారంగాపూర్‌: మండలంలోని రేచపల్లిలో పంటను ధ్వంసం చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. గ్రామానికి చెందిన సిరికొండ నడిపి మల్లయ్య పసుపు, వరి పంటలు సాగు చేశాడు. మామిడిపల్లి వంశీ తన ట్రాక్టర్‌తో పంటను ధ్వంసం చేశాడు. వంశీని ప్రశ్నించగా.. ఆదే గ్రామానికి చెందిన మామిడిపల్లి శ్రీను, మామిడిపల్లి తిరుపతి, మామిడిపల్లి లక్ష్మణ్‌, నాగరం రాజం దున్నమన్నారని చెప్పాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్‌ డ్రైవర్‌తోపాటు నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాయికల్‌: పట్టణంలోని జిల్లాపరిషత్‌ ఉన్నత పాఠశాలలో 2013–14లో పదోతరగతి చదివిన విద్యార్థులు గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. అప్పటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు.





ప్రత్యేకాధికారి నరేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీవో రమాదేవి



ప్రత్యేకాధికారి సంపత్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీవో చిరంజీవి

బాధ్యతల స్వీకరణ

జగిత్యాలరూరల్‌: మండల ప్రత్యేకాధికారిగా బి.నరేశ్‌ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో రమాదేవి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీవో రవిబాబు, సూపరింటెండెంట్‌ గంగాధర్‌ పాల్గొన్నారు.

రాయికల్‌: మండల ప్రత్యేకాధికారిగా డీఆర్డీవో సంపత్‌రావు మండల పరిషత్‌ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మ, పంచాయతీరాజ్‌ ఏఈ ప్రసాద్‌, పర్యవేక్షకుడు వేణుమాధవ్‌, ఏపీఎం చక్రపాణి పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్‌: మండల ప్రత్యేకాధికారిగా ఉద్యానాధికారులు జిల్లా సహకార అధికారి ఎం.సత్యనారాయణను నియమించారు. మండల ప్రజాపరిషత్‌ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో తిరుపతి, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మల్యాల: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా వ్యవసాయాధికారి బి.వాణి గురువారం మండల పరిషత్‌ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సర్పంచుల పదవీకాలం ముగిసిన నాటి నుంచి బి.వాణి మల్యాల మేజర్‌ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారిగా కూడా కొనసాగుతున్నారు. ఎంపీడీవో స్వాతి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

మల్లాపూర్‌: మండల ప్రత్యేక అధికారిగా డీపీవో దేవరాజ్‌ బాధ్యతలు స్వీకరించారు. మండలవ్యాప్తంగా గ్రామాలకు సరఫరా, మురుగు కాలువల్లో నీరు నిల్వ లేకుండా చూడడం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, ఎంపీవో జగదీశ్‌, అధికారుల బృందం శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈజీఎస్‌ ఏపీవో సతీష్‌, మండల పరిషత్‌ సీనియర్‌ అసిస్టెంట్‌ మహేశ్‌, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురి: గురువారం మండల పరిషత్‌ ప్రత్యేకాధికారిగా ఎస్సీ కార్పొరేషన్‌ ఈడీ రాందర్‌ బాధ్యతలు స్వీకరించారు. మండల పంచాయతీ అధికారి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పెగడపల్లి: మండల పరిషత్‌ ప్రత్యేకాధికారిగా వేణుగోపాల్‌రావు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా ఉన్న వేణుగోపాల్‌రావును ప్రత్యేక అధికారిగా నియమించారు.

ధర్మపురి(బుగ్గారం): బుగ్గారం మండల పరిషత్‌ ప్రత్యేకాధికారిగా డి.ప్రకాశ్‌ బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

ఘనంగా నర్సింగరావు జన్మదిన వేడుకలు

మల్లాపూర్‌: కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు జన్మదిన వేడుకలను మల్లాపూర్‌లోని భరతమాత కూడలి వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. కిసాన్‌ కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు ఏలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ సల్లరాజన్న ఆధ్వర్యంలో కేక్‌ కట్‌ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీల గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మసిరెడ్డి సత్తెమ్మ, మామిడి మంజుల, గున్నాల శ్రీనివాస్‌, నాయకులు పాల్గొన్నారు. సిరిపూర్‌లో మాజీ సర్పంచ్‌ నల్ల బాపురెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. నల్ల శ్రీనివాస్‌, నాయకులు పాల్గొన్నారు.

కోరుట్లటౌన్‌: పట్టణంలోని బస్టాండ్‌ చౌరస్తా, అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నర్సింగరావు నిర్వహించారు. పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కోరుట్ల/కోరుట్లరూరల్‌: పట్టణంలోని జువ్వాడి భవన్‌లో కేక్‌ కట్‌ చేశారు. వృద్ధులు, అనాథలకు అన్నదానం చేశారు. అయిలాపూర్‌ ప్రభుత్వ పాఠశాలలో నోట్‌ పుస్తకాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్‌ పట్టణ, మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్‌, కొంతం రాజం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని పార్టీ కార్యాలయంలో 20 మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. కేక్‌ కట్‌ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, జువ్వాడి మహేందర్‌రెడ్డి, తుమ్మనపల్లి రాంప్రసాద్‌ తదితరులున్నారు.



మల్లాపూర్‌లో కేక్‌ కట్‌ చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

సంక్షిప్త వార్తలు

ముదిరాజులు అన్ని రంగాల్లో రాణించాలి

మల్లాపూర్‌: ముదిరాజులు అన్ని రంగాల్లో పురోగమించాలని తెలంగాణ ముదిరాజ్‌ మహాసభ జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ముదిరాజ్‌ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా బోయిని హన్మాండ్లు(పాతదాంరాజుపల్లె)కు ఆయన నియామక పత్రాన్ని అందించారు.

వెంటనే అప్‌డేట్‌ చేయాలి

జగిత్యాల: జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఉన్న ఎస్జీటీ తెలుగు, ఎస్జీటీ హిందీ, పీఈటీ పోస్టులు, డీఈవో లేఖ ద్వారా 389 పోస్టులు స్కూల్‌ అసిస్టెంట్‌ తెలుగు, స్కూల్‌ అసిస్టెంట్‌ హిందీ ఫిజికల్‌ డైరెక్టర్లుగా అప్‌గ్రేడ్‌ అయ్యాయని, ఈ పోస్టుల క్యాడర్‌ స్ట్రెంత్‌ ఐఎఫ్‌ఎంఎస్‌ వెబ్‌సైట్‌లో అప్‌డేట్‌ చేయాలని పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు అన్నారు. ట్రెజరీ అధికారి సోమేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు.

పోచమ్మకు బోనాలు

ధర్మపురి: జైనా గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ముందుగా ఇంటింటికి బోనంతో బయలుదేరి గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

వెల్గటూర్‌: ఎండపల్లి మండలం కొత్తపేటలో వేముల మల్లేశంగౌడ్‌ అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. అంత్యక్రియల్లో మాజీ మంత్రి రాజేశంగౌడ్‌ పాల్గొని నివాళి అర్పించారు.